గృహజ్యోతి వెలుగులు

- 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకున్న వారికి జీరో బిల్లులు
- నారాయణపేట జిల్లాలో 75,813 మందికి లబ్ధి
- ప్రభుత్వం నుంచి రూ.1.65 కోట్ల సబ్సిడీ



నారాయణపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. నారాయణపేట జిల్లాలో గత డిసెంబరు నెలలో 75,813 మంది లబ్ధిదారులకు జీరో బిల్లు జారీ చేయగా, వారు రూ. 1,65,36,353 సబ్సిడీ రూపంలో లబ్ధి పొందారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న వారికి జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. ఈ పథకం తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. గత డిసెంబరు నెలలో నారాయణపేట జిల్లాలోని పేట నియోజకవర్గంలో 32,374 మంది లబ్ధిదారులకు జీరో బిల్లులు ఇవ్వగా, రూ.71,06,645 లక్షలు లబ్ధి పొందారు. మక్తల్ నియోజకవర్గంలో 27,370 మందికి రూ.62,24,929, కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 16,069 మంది లబ్ధిదారులకు రూ.32,04,779 లక్షలు జీరో బిల్లు రూపంలో సబ్సిడీని అందుకున్నారు.



నారాయణపేటలోని ఓ ఇంటి వద్ద జీరో బిల్ కోసం మీటరు రీడింగ్‌ను తీసుకుంటున్న లైన్‌మన్ బండి ఆనంద్

నేడు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ



మహబూబ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాయమ్మతోటలో గల రిషి జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నది. ఉదయం 9:30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.ఆరు వేలు, ద్వితీయ బహుమతిగా రూ.నాలుగు వేలు, తృతీయ బహుమతిగా రూ.మూడువేల నగదు అందించనున్నారు. ప్రముఖ విద్యావేత్త, రిషి కళాశాల చీఫ్ అకాడమిక్ అడ్వైజర్ ఎస్ వెంకటయ్య, కళాశాల చైర్‌పర్సన్ ఎస్ చంద్రకళవెంకట్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు. పోటీలో పాల్గొనే వారు రంగులు తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గుకు ప్రాధాన్యం ఉంటుంది. పోటీ ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ హాజరుకానున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎన్ శ్రీనివాస్

ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరేనా? 7

పేట జిల్లాకు 2,500 ఎకరాలు టార్గెట్ ఇప్పటి వరకు సాగు అయింది 50 శాతం మాత్రమే

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మూసాపేట యువకుడు 7

జీవితంలో సైన్స్ అవసరం



ఓ ప్రదర్శనను తిలకిస్తున్న నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



బహుమతిని అందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- పాఠశాల స్థాయి నుంచే వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలి
- సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నారాయణపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి జీవితంలో సైన్స్ అవసరమని, పాఠశాల స్థాయి నుంచే వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌లో మాత్రమే కాకుండా అన్ని విషయాల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చక్కటి ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు ఎనిమిది వేల మందికిపైగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను తిలకించారు. మంచి ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి, బహుమతులను అందించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, సీపీవో యోగానంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీవసంత, ఆయా శాఖల అధికారులు, పీఆర్‌టీయూ, తపస్ నాయకులు, పీడీ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవం విజయవంతానికి చర్యలు

- జిల్లా, మండల స్థాయిలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తాం
- పోలేపల్లి సెజ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అవగాహన కల్పిస్తాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయేందిర బోయి



రోడ్డు భద్రత మాసోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్న రోడ్డు భద్రత మాసోత్సవాన్ని విజయవంతం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. రోడ్డు భద్రత మాసోత్సవ నిర్వహణపై రాష్ట్ర బీసీ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, రవాణ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవంపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రవాణా, ఆర్టీసీ, విద్యా, పోలీస్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో వాహనదారులు, ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా జిల్లా మంత్రితో పాటు ఇతర ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని జిల్లా, మండల స్థాయిలో అవగాహన ర్యాలీలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో పంచవటి ఉన్నత పాఠశాల, జడ్చర్లలో స్వామి నారాయణ గురుకుల ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతకు సంబంధించి అవేర్ నెస్ పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల ద్వారా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లో గల ఎస్కేబీఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శన నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా రవాణా, నేషనల్ హైవే, ఆర్టీసీ తదితర శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్, ఎస్పీ తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాలపై రూపొందించిన పోస్టర్, స్టిక్కర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్, ఆర్టీసీ ఆర్ఎం సంతోష్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ దేశ్యానాయక్, మోటార్ వేహికిల్ ఇన్‌స్పెక్టర్ రఘు పాల్గొన్నారు.

న్యాక్ గ్రేడ్‌తో మరింత అభివృద్ధి

పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీకి న్యాక్ నుంచి మంచి గ్రేడ్ వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పీయూ ఫార్మసీ ఆడిటోరియంలో న్యాక్ ఓరియెంటేషన్ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ న్యాక్ టీం వచ్చే వరకు అన్ని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. న్యాక్ గుర్తింపుతో ఉద్యోగ అవకాశాలు, కొత్త కోర్సుల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు ఎస్‌వీ శాస్త్రి మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్‌లో పొందుపరిచిన డాక్యుమెంట్లను అన్ని విభాగాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, వీసీ ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించాలి

- పోలీసు కుటుంబాలకు మానసిక ప్రశాంతత అవసరం
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ, వ్యక్తిగత జీవితంలో ఒత్తిడిని అధిగమించాలని మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి అన్నారు. జడ్చర్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శనివారం విధి నిర్వహణ, వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి అధిగమించడం కోసం సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్‌తో ప్రత్యేక సెమినార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు విధులు అంటేనే సవాళ్లతో కూడుకున్నదన్నారు. ప్రజారక్షణ కోసం సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. ఒత్తిడిని అదుపులో పెట్టడంతో వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. దీంతో విధి నిర్వహణలో పనితీరు మెరుగుపడుతుందని అన్నారు. పోలీసు కుటుంబాలకు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సెమినార్‌లో ఒత్తిడి అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలను సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్ మార్గదర్శకం చేశారు. దైనందిన జీవితంలో ధ్యానం, యోగా, మెదడుకు విశ్రాంతి కల్పించే ఉపాయాలను వివరించారు. శ్వాస నియంత్రణ పాటించడం ఎంత ముఖ్యమో తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ రవి, ఆర్ఐలు కృష్ణయ్య, నాగేశ్, రవి, రమేశ్, ఐటీ కోర్ టీం రాఘవేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



వెన్నాచేడ్‌లో ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

● అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

గండీడ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఎస్సీ వసతి గృహం, బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి తప్పులు జరుగకుండా చూడాలన్నారు. అర్హులైన వారి పూర్తి డేటా ఉండాలని తెలిపారు. వసతి గృహం బాత్ రూముల్లో లీకేజీ లేకుండా మరమ్మతు చేయాలన్నారు. కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎంపీవో నరేందర్ రెడ్డి, హెచ్‌ఎం మల్లిఖార్జున్, గ్రామ కార్యదర్శి కృష్ణనాయక్, వార్డెన్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచు పుల్లారెడ్డి, రాములు, పులేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రండి

మంత్రులకు ఆహ్వానం పలికిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ లోని ఎస్వీకేఎం పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించడానికి రావాలని మంత్రులతో పాటు పలువురికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో శ్రీనివాసులు శనివారం హైదరాబాద్‌లో ఆహ్వానం అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళిలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 861 ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2,500 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలు ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. వాటిలో ఇన్‌స్పైర్ విభాగంలో 300, ఆర్‌ఎస్ బీవీపీ విభాగంలో 561 ప్రదర్శనలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన కోసం 26 కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన ప్రదర్శనను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. అందుకోసం ఢిల్లీ నుంచి ఎస్సీఈఆర్టీకి సంబంధించి న్యాయనిర్ణేతలు రానున్నారని చెప్పారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహకు ఆహ్వానపత్రం అందిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మైసమ్మ అమ్మవారు

నవాబ్‌పేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష అలంకరణ, అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లేష్, రామస్వామి, రవి, బక్క నర్సింహులు, రాంచంద్రయ్య, కట్ట బాలస్వామి, ముర్గని బాలకిష్టయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా



పీయూ పరిపాలన భవనం ముందు ధర్నా చేస్తున్న పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో తక్కువ వేతనాలతో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు పెంచాలని పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌జీ డిమాండ్ చేశారు. శనివారం పీయూ పరిపాలన భవనంలో నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీయూ ప్రారంభమైనప్పటి నుంచి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని ఇప్పుడున్న ఖర్చులకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. వేతనాలు పెంచకపోతే పెన్‌డౌన్ చేసి, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక కమిటీ వేసి వేతనాలను ఏ ప్రాతిపదికన పెంచాలనేది నిర్ణయం తీసుకుంటామన్నారు. పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు పర్వతాలు, రాము, నరసింహ, శ్రీనువాసులు, రాముయాదవ్, నరేష్, శ్రీను, రాగిణి, శ్వేత పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకాలు

ధన్వాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ధన్వాడ విద్యార్థులు బంగారు పతకం సాధించారు. డిసెంబరు 30 నుంచి జనవరి రెండో తేదీ వరకు హనుమకొండ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ధన్వాడ విద్యార్థులు పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు పాల్గొనగా ఇందులో నలుగురు విద్యార్థినులు, తొమ్మిది మంది విద్యార్థులు ఉన్నారని కోచ్ శ్రీనివాసులు తెలిపారు. ధన్వాడకు చెందిన విద్యార్థినులు రజిత, బాలమణి, గీత, నాగలక్ష్మి గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ వివరించారు. వారిని జిల్లా క్రీడాలధికారి వెంకటేష్‌శెట్టి, కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు తీర్చడంలో అధికారుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పోతులమడుగు గ్రామ శివారులోని మినీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకై నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మండలంలోని 18 గ్రామ పంచాయితీల ప్రజలతో ఎమ్మెల్యే గ్రామాల వారిగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ముఖ్యంగా లోవోల్టేజీ సమస్య ఉన్నట్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకున్నట్లుగా ప్రజలు సమావేశంలో చర్చించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ సమస్య విషయంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. భట్టుపల్లి తండాలో స్కూల్ భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొటున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. పాఠశాల భవనం, తాగు నీటి సమస్యను తీర్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందే విధంగా చొరవ తీసుకోవాలన్న లక్ష్యంతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో వేధిస్తున్న ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ చంద్రమౌళి, ఈఈ చంద్రశేఖర్, సీఐ రామకృష్ణ, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్, ఎంపీడీవో ప్రభాకర్ చారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహ రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరే శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్ పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలు ప్రారంభం



సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న గోపాలం

మక్తల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా సైక్లింగ్ పోటీలను జిల్లా క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలను ఈనెల 6 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపిస్తామన్నారు.

కార్యక్రమంలో పీడీలు విష్ణువర్ధన్‌రెడ్డి, నరేష్, ఈశ్వర్, మీనాకుమారి, రాకేష్, విద్యాసాగర్, లావణ్య, రూప, రమేష్‌కుమార్, శ్రీలత, స్వాతి, రవీందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

గంగాపురం హుండీ ఆదాయం రూ.21 లక్షలు



హుండీలోని డబ్బులను లెక్కిస్తున్న భక్తులు

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.21,53,272 ఆదాయం వచ్చింది. శనివారం ఆలయ ప్రాంగణంలో ఈవో దీప్తిరెడ్డి, పర్యవేక్షకులు శ్రీనివాస్ సమక్షంలో హుండీలను లెక్కించారు. మార్చి 11, 2024 నుంచి 2025 జనవరి 3వ తేదీ వరకు భక్తులు హుండీలలో వేసిన కానుకలు లెక్కించినట్లు వారు తెలిపారు. నగదుతో పాటు 4.790 గ్రాముల మిశ్రమ వెండిని భక్తులు సమర్పించుకున్నారని పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, విశ్వం, గరుడగమన సేవా సమితి సభ్యులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 28, 29 తేదీలలో కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో నిర్వహణ



అంతర్జాతీయ సెమినార్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ

కొల్లాపూర్/పాలమూరు యూనివర్సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో ఈ నెల 28, 29 తేదీలలో మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాలమూరు విశ్వవిద్యాలయంలో కొల్లాపూర్‌లో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను పీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనిస్ అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీయూ అధికారులు ఎంఎస్‌డబ్ల్యూ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జెన్‌కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానందానికి వినతి



హైడెల్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న 1535 యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్

దోమలపెంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీజీ జెన్‌కోలో నెలకొన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని హైడల్ డైరెక్టర్ సచ్చిదానందానికి శనివారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో 1535 యూనియన్ సెంట్రల్ కమిటీ నాయకులు ఆయనను కలిశారు. జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని విన్నివించడంతో ఆయన సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఏ వజీర్, సుంకరి లవకుమార్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్య

అచ్చంపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సాంఘిక, బీసీ, ఎస్టీ గురుకులలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, బోనఫైడ్, ఆదాయ, కుల ధ్రువీకరణ ప్రతాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల మానవహారం

గద్వాల టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోసం నివరధిక సమ్మె కొనసాగిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ ఉద్యోగులు 26వ రోజు శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కృష్ణవేణి చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమ్మెకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తరఫున అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. సమ్మెలో గద్వాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ శేషన్న, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు ఉన్నారు.




పట్టణంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

శ్రీశైలం డ్యాంలో 109 టీఎంసీల నీటినిల్వ

- నాలుగు రోజులుగా పంపు మోడు నిలిపివేత
- ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

దోమలపెంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతం నుంచి శ్రీశైలం డ్యాంలోకి ఎటువంటి నీరు చేరడంలేదు. ఎగువ ఉన్న జూరాల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదన చేయడం లేదు. శనివారం శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను 861.10 అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీల గాను, 109, 2730 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు డ్యాం గేజింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లలో 28,252 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. కృష్ణానదికి అనుసంధానంగా ఉన్న కాలువకు ఎంజీకేఎల్ఐ 2,334, పీఆర్‌పీ 1,500, ముచ్చుమర్రి (కేసీసీ) 490 క్యూసెక్కుల నీటిని కాల్వల ద్వారా తరలిస్తుండగా, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి 28, 252 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కాగా ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం 1వ యూనిట్ డ్రాఫ్ట్‌ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి లీకేజీ వాటర్ తీవ్రత తగ్గే వరకు జెన్‌కో అధికారులు పంపుమోడ్ (డ్యాంలోకి నీటి మళ్లింపు)ను పరిశీలిసున్నందున నాలుగు రోజులుగా పంపుమోడ్‌తో పాటు 1వ యూనిట్‌లో విత్యుత్ ఉత్పత్తి కొనసాగించవద్దని జెన్‌కో అధికారులు నిర్ణయించారు.



శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జేష్టాదేవి సమేత సార్ధసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వరస్వామికి శనివారం భక్తులు నల్లని దుస్తులు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులతో పూజలు చేశారు. శనీశ్వరస్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు తాగునీటి వసతి, అల్పాహారం ఏ ర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రావు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యు లు ప్రభాకరాచారి, వీరశేఖర్ తదితరులు ఉన్నారు.



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వంకేశ్వరం విద్యార్థికి జిల్లా మొదటి ర్యాంకు

పదర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక శాస్త్ర ప్రతిభా పాఠవ పరీక్షలో మండలంలోని వంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి రాకేష్ మొదటి ర్యాంకు సాధించాడు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో సాంఘిక ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వంకేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి రాకేష్ మొదటి ర్యాంకు సాధించడంతో ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు పాండు, నిరంజన్, బురాన్, అంజనమ్మ అభినందించారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

గద్వాల న్యూటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో గురుకులాల విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- రాష్ట్రంలోని గురుకులాలు విద్యార్థుల చావు కేకలతో మార్మోగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సుమారుగా గురుకులాల్లో 49 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కొన్ని గురుకులాల్లో విద్యార్థులు పాము కాటుకు బలయ్యారని, మరికొంతమంది ఫుడ్ పాయిజన్‌తో మరణించారన్నారు. ఇంకొందరు అధికారుల వేధింపులకు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పాటు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం లేదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

వంగూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా వంగూరు మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీన ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా స్థాయి వాలీబాట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరిప్రసాద్, జంగీర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు ఉంటుందని, ఆసక్తి ఉన్న యువకులు టీమ్‌ల పేర్లను నమోదు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

మురిసిన ముగ్గులు

- పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న వనితలు
- నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో నిర్వహణ
- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన

ముత్యాల ముగ్గులు మెరిసి.. మురిపించి... మైమరిపించాయి. ఇలపై ముద్దాడాయి. నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ పోటీల్లో వనితలు రంగుల హరివిల్లును ఇలపై పరిచారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా ఆరు వేలు, రెండో బహుమతిగా నాలుగు వేలు, మూడో బహుమతిగా మూడు వేల నగదును అందజేశారు. ముగ్గుల ఎంపికలో న్యాయనిర్ణేతలు చాకచక్యంగా వ్యవహరించారు.

- నాగర్‌కర్నూల్ టౌన్, గద్వాల/వడ్డేపల్లి, వనపర్తి రాజీవ్‌చౌరస్తా


జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నాగర్‌కర్నూల్


నాగర్‌కర్నూల్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత కె.సంధ్య


నాగర్‌కర్నూల్‌లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత ఎం.అనూష



నాగర్‌కర్నూల్‌లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత డి.జ్యోతి

జోగుళాంబ గద్వాల


గద్వాల జిల్లా శాంతినగర్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత గౌతమి



గద్వాల జిల్లా శాంతినగర్‌లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత సుమిత్ర


గద్వాల జిల్లా శాంతినగర్‌లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత లావణ్య

వనపర్తి


వనపర్తిలో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత కవిత


వనపర్తిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత అరుణశ్రీ



వనపర్తిలో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత సునీత


నాగర్‌కర్నూల్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు తదితరులు


గద్వాల జిల్లా శాంతినగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


వనపర్తిలో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు తదితరులు



వనపర్తిలో స్పాన్సర్స్ లోగోలను వేస్తున్న మహిళ

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

- పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పేరున పాలమూరు-రంగారెడ్డి పథకం నీరు తరలింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్న అంశాలపై ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోల భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పాలమూరు అధ్యయన వేదిక తెలిపింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జి.హరగోపాల్, కన్వీనర్ ఎం.రాఘవాచారి, ఎ.తిమ్మప్ప, ఎం. వెంకట్రాములు, జి.వెంకట్‌గౌడ్, కె.వెంకటేశ్వర్లు, ఎం.డి ఇక్బాల్‌పాషా, కె.రవీంద్రనాథ్‌లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వ్యతిరేకించారు. పాలమూరు-డిండి ఎత్తిపోతల పథకం చేపట్టాలనే ప్రతిపాదన సరైంది కాదని తెలిపారు. పాలకులు మారినప్పుడు తమ ఆలోచనను మార్చుకోవటం సరికాదని, 14 నియోజకవర్గాల ఉమ్మడి జిల్లా జలవనరుల కల్పన కృష్ణానది నీటిలో తెలంగాణ రాష్ట్ర వాటా సాధన తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో జలవనరుల నిపుణులు, పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామిక వాదులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలనుంచి రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని తెలిపారు.

1994లోనే కృష్ణానదిలో నీటి వాటాకోసం మహబూబ్‌నగర్ జిల్లాలోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు.

ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు బహిరంగ లేఖ రాశామన్నారు.

2013లోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మనం జూరాల నుంచి నీరు తీసుకునే విధంగా సాధించుకున్నామని తెలిపారు. తొమ్మిదన్నరేళ్లుపాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఏడాది నుంచి కాంగ్రెస్ పాలన చూస్తూనే ఉన్నాం.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దూకుడుగా మరోసారి డిండి ఎత్తిపోతల పనులకు తెగబడటం సరికాదన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరేనా?

- పేట జిల్లాకు 2500 ఎకరాలు టార్గెట్
- ఇదివరకు సాగైంది 50 శాతం మాత్రమే
- అధికారులు కోరుతున్నా ముందుకు రాని రైతన్నలు

దామరగిద్ద, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో 2024-25 ఏడాదికి గాను 2500 ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం కేటాయించింది. జిల్లా కలెక్టర్ 1500 ఎకరాలకు మంజూరు చేసి మొక్కలు నాటేందుకు ఆర్డర్లు ఇచ్చింది. కానీ ఇదివరకు 700 ఎకరాలు మాత్రమే ఆయిల్ పామ్ సాగు చేశారు. ఇంకా కొందరు రైతులు ఇప్పుడు ఇప్పుడే మొక్కలు నాటుతున్నారని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో మంచి లాభాలు ఉన్నాయని, ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీ ఇస్తుందని ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు. కానీ రైతులు మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రాయితీ విషయానికి వస్తే ఆయిల్ పామ్ సాగు చేసుకునే ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ కల్పించింది. చిన్న సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ కల్పించింది. కేవలం 10 శాతం మాత్రమే రైతు వాటాగా భరించాలి. అయినా రైతులు మాత్రం అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. ఒక్క ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ. 16,800 రాయితీన ప్రభుత్వం చెల్లిస్తుంది. రైతు వాటాగా కింద రూ. 1140 చెల్లించి రైతు ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు రైతులను కోరుతున్నారు. ఇతర పంటల కంటే ఆయిల్ పామ్ సాగుతో మంచి లాభాలు పొందవచ్చన్నారు. దీంతో పాటు ఆయిల్ పామ్ సాగు చేస్తున్న పొలంలో అంతర పంటగా పెసర, వేరుశనగ, కంది, మిరప, సాగు చేసుకుని రైతులు లాభం పొందవచ్చన్నారు. ఈ విషయమై జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ బోరు వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని రైతుకు రాయితీపై ప్రభుత్వం డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని నీటి వసతి ఉన్న రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్చి 2025 నాటికి ఆయిల్ పామ్ లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.


ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

భూ బదలాయింపు కేసులో ఇద్దరు తహసీల్దార్లపై కేసు నమోదు

అమ్రాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం కేంద్రానికి చెందిన మాలె శంకరయ్యకు చెందిన 900 సర్వే నంబరులో ఐదు గుంటల భూమిని పలకపల్లి అలీ అనే వ్యక్తికి బదలాయింపు చేసిన విషయంలో ఇద్దరు తహసీల్దార్లపై కేసు నమోదు చేసినట్లు అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శంకరయ్య పేరు మీద ఉన్న 900 సర్వే నంబరులో ఉన్న ఒక ఎకరం 10 గుంటల భూమిలో ఎకరా భూమిని గతంలో ఆర్టీసీ బస్టాండ్ కోసం ఇవ్వగా, మిగిలిన 10 గుంటలకు గాను ఐదు గుంటల భూమిని గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్లు జి.పి.పాల్, జె.కృష్ణయ్యలు పలకపల్లి అలీ పేరిట చేశారని శంకరయ్య ఇటీవల ఒక ప్రైవేట్ సివిల్ కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం కోర్టు తీర్పును వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు తహసీల్దార్‌లపై ఐపీసీ 420, 199 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

నలుగురు ఆకతాయిలకు పోలీస్ కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలను వేధిస్తున్న నలుగురు ఆకతాయిలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. భరోసా కేంద్రంలోని షీటీమ్ కార్యాలయంలో ఆకతాయిలకు శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ చేశారు. ఎస్పీ జానకి ఆదేశాల మేరకు షీటీమ్స్ అమ్మాయిలను వేధిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నాయి. వీరికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేశారు. మొదటి తప్పుగా కౌన్సెలింగ్ చేస్తున్నామని, మళ్లీ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులు, ఎన్‌జీవోస్ చంద్రశేఖర్, జగపతిరావు, రాజసింహుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికైన లక్ష్మి



గోవర్ధన్

గద్వాల అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన లక్ష్మి, గోవర్ధన్‌లు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనగామ జిల్లాలో గత నెల డిసెంబర్ 27 నుంచి 30వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలుర విభాగం నుంచి గోవర్ధన్, హకీంపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో లక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా కబడ్డీ అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి, కన్వీనర్ అబ్రహంలు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 8 నుంచి 11 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. అభినందించిన వారిలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు తిరుపతి, రజనీకాంత్, కబడ్డీ నరసింహ, సురేష్, రవి, చందు, కరెంటు నరసింహ, టి.నాగేష్, జగదీష్, రైల్వే పాషా, రఘు, వెంకటన్న, కృష్ణ, మహేష్, శివశంకర్ ఉన్నారు.

వాలీబాల్ పోటీలకు మూసాపేట యువకుడు


మహ్మద్ హబీబొద్దీన్

మూసాపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ ఎంపిక క్రీడా పోటీల్లో మూసాపేట మండల కేంద్రానికి చెందిన మహ్మద్ హబీబొద్దీన్ నేషనల్ లెవల్ సీనియర్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 13 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరుగబోయే నేషనల్ లెవల్ సీనియర్స్ వాలీబాల్ క్రీడా పోటీలకు హాజరు కానున్నారు. ఇతను తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులోని డీఆర్‌ఎన్‌జీపీ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదుతున్నాడు. గతంలో కూడా జమ్మూకశ్మీర్‌లో జరిగిన జూనియర్స్ లెవల్ వాలీబాల్ పోటీల్లో ఆడి తమదైన ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు మహ్మద్ హబీబొద్దీన్ ఎంపిక కావడం పట్ల అతని తండ్రి మహ్మద్ మొహియొద్దీన్, మాజీ ఉపసర్పంచి తాజోద్దీన్, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఉందేకోడు కృష్ణ, మాజీ అధ్యక్షుడు శెట్టిశ్రావణ్, బల్లె నవీన్, ఆరీఫొద్దీన్, ముక్తార్ తదితరులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్వ్యూ..

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

» పశువైద్యాధికారి ఆశారాణి



జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే పాడి పశువులు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని కావేరమ్మపేట పశువైద్యాధికారి ఆశారాణి తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

మండలంలో ఎన్ని పశువులు ఉన్నాయి?

మండలంలో 10,719 ఆవులు, 8,690 ఎద్దులు ఉన్నాయి. ప్రస్తుతం ఈనే సమయం కాబట్టి, మరింత పెరిగే అవకాశం ఉంది.

పుట్టిన దూడలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

పుట్టిన దూడలకు వెంటనే టీటీ వ్యాక్సిన్ వేయించాలి. అలాగే 7వ రోజు యాంటిబయోటిక్ పౌడర్ తాగించాలి. అనంతరం నట్టల నివారణ మందులు వేయించాలి.

పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు ఏంటి?

ప్రస్తుతం పశువులకు గొంతువాపు, నిమోనియా వచ్చే అవకాశం అధికంగా ఉంది.

చలి కాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏంటి?

ప్రస్తుత చలికాంలో పాడి పశువులను బయటికి వదిలి పెట్టకూడదు. షెడ్‌లలో వెచ్చగా ఉంచాలి. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి. శుభ్రమైన నీటిని ఇవ్వాలి. దోమల బారి నుంచి కాపాడేందుకు వేప ఆకుతో పొగ వేయాలి.

న్యూస్ బాక్స్

తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని 24వ వార్డులో రోడ్డుపైకి మురుగునీరు రాకుండా తాత్కాలికంగా డ్రైనేజీని కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. విద్యానగర్ కాలనీలో మురుగునీరు రోడ్డుపై పారుతోందంటూ కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం ఎక్స్‌కవేటర్‌తో తాత్కాలికంగా డ్రైనేజీని ఏర్పాటు చేయించారు. కాలనీవాసులు లింగం, బుద్ధ, షఫీక్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యాసంస్థ ప్రతినిధి స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం అనంతప్ప, జరీనాబేగం, కిరణ్‌కుమార్, మల్లస్వామి, తిరుపతిరెడ్డి, జ్యోతి, కవిత, షర్మిల, మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడు నుంచి డప్పు కళాకారుల ప్రచార యాత్ర

పాలమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జనవరి 7వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలో డప్పు కళాకారుల ప్రచార రథ యాత్రను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్య, శ్రీరాములు, బాలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు - వేయి గొంతుల మహా కళా ప్రదర్శన విజయవంతం చేయటానికి సన్నాహక రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

కోయిలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తిడి లేని విద్యను జయించినప్పుడే లక్ష్యం సాధిస్తారని సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గార్లపాడ్ ఉన్నత పాఠశాలలో ఈదా, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని, మాట్లాడారు. హెచ్‌ఎం పవన్‌కుమార్, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, సభ్యుడు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సేవాలాల్ క్రికెట్ టోర్నమెంట్

కోయిలకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనయపల్లితండాలో ఆదివారం నుంచి జై సేవాలాల్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి సంక్రాంతి పండుగ వరకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు అందిస్తున్నట్లు నిర్వాహకులు వినోద్, రాహుల్, రవి, వికాస్ తెలిపారు. ఇప్పటికే 12 జట్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రాజాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 112వ బూత్ అధ్యక్షుడిగా పల్లె కృపేందర్, జనరల్ సెక్రటరీగా చక్రపాణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి రామకృష్ణ, వనపర్తి నర్సిములు, పల్లె శేఖర్, రాజు, ఆనంద్, ఆదిత్య, బాలగౌడ్, హరికృష్ణ రెడ్డి, గంగాధర్‌గౌడ్, అరుణ్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.




అమిస్తాపూర్ శివారులో ఉన్న వసురాంతండా, నల్లగుట్ట తండా రోడ్లు (ఫైల్)

తండాలకు బీటీ రోడ్లు పడేనా?

» బీటీ రోడ్లకు నోచుకోని గిరిజన తండాలు » పనులు ప్రారంభించారు.. మధ్యలోనే వదిలేశారు

భూత్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గిరిజన తండాలకు కనీస రోడ్డు సౌకర్యాలు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారితే తండాలకు రోడ్డు సౌకర్యాలతో పాటు పలు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని గిరిజనులు ఆశపడినా.. వారికి నిరాశే ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే.. భూత్పూర్ గ్రామం 2018లో మునిసిపాలిటీగా ఏర్పడింది. మునిసిపాలిటీగా ఏర్పడి దాదాపు ఆరేళ్లు అవుతున్నా చుట్టూ పక్కల ఉన్న ఎనిమిది గిరిజన తండాలకు కనీస రోడ్డు సౌకర్యాలు లేవు. మునిసిపల్ చైర్మన్ బస్వ రాజుగౌడ్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి తండాలకు రూ.12.52 కోట్ల నిధులతో బీటీ రోడ్లను మంజూరు చేయించారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న వసురాంతండా, గేగ్యాతండా, నల్లగుట్ట తండా, వాల్యతండా, మిట్యా తండా, నక్కలబండ తండా, నర్సింగాపూర్, చెర్లతండాతో పాటు మరి కొన్ని తండాలకు బీటీ రోడ్డు వేయడానికి గత ఏడాది కాలంలో ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అయితే నర్సింగాపూర్, చెర్లతండాలకు సంబంధించి బీటీ రోడ్డు పూర్తి అయ్యింది. మిగిలిన వసురాంతండా, నల్లగుట్ట, వాల్య తండాలకు సంబంధించి 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన తండాలకు నిధులు మంజూరైనా గుత్తేదారు నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదు కానీ, బీటీ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునర్ ప్రారంభించాలని ఆయా తండాల గిరిజనులు కోరుతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందిగా ఉంది..



వర్షాకాలంల వచ్చిందంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా రోడ్డు సక్రమంగా లేకపోవడంతో స్కూల్ బస్సులు రావడం లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్తేంటే బురదలో పడిపోయాము. మునిసిపాలిటీ వారు స్పందించి బీటీ రోడ్డు వేయాలి.

\- జానకిరాంనాయక్, వాల్యతండా

తండాలకు బీటీ రోడ్డు నిర్మించాలి..



మునిసిపాలిటీ అయితే రోడ్డు వేస్తారన్నారు. నిధులు మంజూరైనట్లు చెబుతున్నారు. కానీ ఇంతవరకు రోడ్డు మాత్రం వేయలేదు. వర్షాకాలం రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు వచ్చి హామీలు ఇస్తారు. కానీ వరకు హామీలు నెరవేరలేదు.

\- భోజ్యానాయక్, గుబ్బండి తండా

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మునిసిపాలిటీలోని మొత్తం ఎనిమిది గిరిజ తండాలకు బీటీ రోడ్లకు రూ.12.52 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గతేడాది పనులు కూడా ప్రారంభించాం. నర్సింగాపూర్, చెర్ల తండా బీటీరోడ్లు పూర్తి కాగా, మిగిలిన తండాల పనులు త్వరలో తిరిగి ప్రారంభిస్తాం.

\- వినోద్, మునిసిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఏఈ

అభివృద్ధి నిరంతర ప్రక్రియ



హనుమాన్‌పురలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పాలమూరు పురపాలిక పరిధిలోని 12, 13, 20, 41, 38వ వార్డుల్లో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 12వ వార్డులో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించడంతో పాటు రూ.80 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఇది వరకు కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. వచ్చే నాలుగేళ్లలో పాలమూరు రూపురేఖలు మారుస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఉమర్ పాషా, లక్ష్మీదేవమ్మ, రావుల అనంతరెడ్డి, నాయకులు రాశెద్‌ఖాన్, అంజద్‌అలీ, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి మహిళలకు వరం



కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహ్మదాబాద్/గండీడ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ మహిళలకు ఓ వరం లాంటిదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం గండీడ్, మహ్మదాబాద్ మండల కేంద్రాల్లో అర్హులైన వారికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం టీఎస్ పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు గండీడ్‌లో కస్తూర్బా పాఠశాలను ప్రారంభించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మిడ్జిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలతో పాటు పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఎంఈవో సుధాకర్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి బొల్ల సునీల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు వెంకటయ్య, సరస్వతి, టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం బాబునాయుడు, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రాజేష్, కృష్ణమోహన్, మంజుల ఉన్నారు.

యూటీఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవాబ్‌పేట : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో నాగ్యనాయక్, యూటీఫ్ మండల అధ్యక్షుడు ఎండీ.అయూబ్ ఖాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, కిషన్, కవిత పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

మిడ్జిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్నందున్న ప్రణాళికతో ముందుకెళ్లాలని హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధి కల్యాణ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు కల్యాణ్, స్వరూప మాట్లాడుతూ విద్యార్థులందరూ టైం మేనేజ్‌మెంట్‌ను మూడు రకాలుగా ఉపయోగించుకోవాలన్నారు. మొదటిది సమయం, రెండోది ప్రస్తుత సమయం, ఫ్యూచర్ సమయం అని గుర్తుచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, లెక్చరర్లు విజయంత, కరంజి, చరణ్, నరసింహ, జనార్దన్‌రెడ్డి, సంధ్యారాణి, నవీన, మహేష్, గోపాల్ ఉన్నారు.

ఆల శశివర్ధన్‌రెడ్డికి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్న ఆల శశివర్ధన్‌రెడ్డి వర్ధంతిని శనివారం అన్నసాగర్‌లో నిర్వహించగా, ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యా రు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు పాల్గొని నివాళి అర్పించారు.

రేపు పీయూలో పూలే జయంతి

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో పీయూ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 6న సావిత్రి బాయి పూలే జయంతి సభను నిర్వహిస్తున్నట్లు పీయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఈ సందర్భంగా పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

మైనార్టీల సంక్షేమంపై దృష్టి సారించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమంపై దృష్టి సారించాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా శనివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ మైనార్టీలకు సంక్షేమ పథకాలతో పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు.

'మా ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి'

భూత్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల పక్షపాతిగా మా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం భూత్పూర్‌లోని మినీ ఇండోర్ స్టేడియంలో పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, బుచ్చారెడ్డి, ఎంఈవో ఉషారాణి, మండల నాయకులు బాలరాజు, కృష్ణ, రేవతి, కొప్పోలు యాదయ్య, సాయిరాంగౌడ్, పద్మావతి, సురేష్‌రెడ్డి, సురేందర్, రాంప్రభు, నరేందర్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

దేవరకద్ర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

8న పీయూలో విజయోత్సవ సభ

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పీయూకి ఇంజనీరింగ్, న్యాయ కళాశాలను అనుమతి రావడంతో 8న పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు పీయూ విద్యార్థి నాయకులు శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ వీసీ జీఎన్ శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు.విద్యార్థి నాయకులు కార్తీక్, బత్తిని రాము, పవన్‌కుమార్, వంశీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేసి, నివాళి అర్పిస్తున్న నాయకులు

మిడ్జిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణిపేట గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని పలు పార్టీల నాయకులు, కుల సంఘాలు, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత కొన్ని రోజులుగా విగ్రహం ఏర్పాటుకు స్థలం కోసం చూసినప్పటికీ స్థలం ఇవ్వడానికి కొందరు అడ్డుపడుతున్నారనే వదంతులు వినిపించాయి. శనివారం గ్రామ పెద్దల సమక్షంలో స్థలాన్ని కేటాయించి విగ్రహం ఏర్పాటు చేసే స్థలంలో అంబేడ్కర్ ఫొటో పెట్టి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిరంజన్, ఉప సర్పంచ్ రాంచంద్రయ్య, వాడియాల ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్యమాదిగ, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, కాంగ్రెస్ నాయకులు బరిగెల వెంకటయ్య, అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గౌస్, నాయకులు విజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగళ్ల సురేష్‌మాదిగ, నాయకులు మావిళ్ల వెంకటయ్య, రాజేష్, పవన్, అంజయ్య, ఈశ్వరయ్య, శంకరయ్య, మాసయ్య, వెంకటయ్య, జగన్, శ్రీను, రాజు, రఘు, శ్రీకాంత్, రవి, నాగయ్య, నరేష్ పాల్గొన్నారు.

ప్రతీ మండలానికి ఎంఈవోను నియమించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరిధర్ గౌడ్

బాలానగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతీ మండలానికి ఎంఈవోను నియమించాలని హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతీ వేసవి కాలంలో బదిలీల ప్రక్రియను చేపట్టాలని, రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. జీరో సర్వీస్‌తో ఉపాధ్యాయుల ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎంఈవో బాధ్యతను హెచ్‌ఎంలకు తప్పించి ప్రత్యేక ఏజెన్సీలకు ఎన్జీవో సంఘాలకు అప్పగించాలన్నారు. ప్రతీ ఉన్నత పాఠశాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రతీ కాంప్లెక్స్ పాశాలకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం

గండీడ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధే ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ అన్నారు. శనివారం గండీడ్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గండీడ్, మహమ్మదాబాద్ ఉమ్మడి మండలాల పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మదాబాద్ మండలానికి ప్రత్యేకంగా ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటుకు పాలక వర్గం సభ్యులను ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీ ఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీవో శంకరాచారి, డీసీఏవో టైటస్‌పాల్, మానిటరింగ్ అధికారి వీరభద్రయ్య, మమత, డైరెక్టర్లు వెంకటయ్య, దశరథ్ గౌడ్, అశోక్ గౌడ్, రాంరెడ్డి, చంద్రయ్య, బాలస్వామి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి రూ.2.51 లక్షల విరాళం

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం కుర్వగడ్డపల్లి సమీపంలోని దుందుభీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న పరషవేదీశ్వర స్వామి ఆలయ రాతి కల్యాణ మండపం నిర్మాణానికి రూ2.51 లక్షల విరాళాన్ని భక్తులు మహలింగం, నాగహైమావతి దంపతులు అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బుద్దసముద్రం గ్రామానికి చెందిన వీరు శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. గోపాల్‌ముదిరాజ్, కైలాస్ ఝావర్, పుట్ట పర్వతాలు, చెన్నయ్య, దామోదర్, నర్సిములు గౌడ్ పాల్గొన్నారు.

గార్లపాడ్‌ను మండలంగా చేయడానికి కృషి

కోయికొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గార్లపాడ్‌ను మండలం చేయుటకు కృషి చేస్తానని నారాయణపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం గార్లపాడ్ నాయకులు కలిసి వినతిపత్రం అందించగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తప్పకుండా మండలం చేస్తామని శివకుమార్‌రెడ్డ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగర్ కన్వీనర్ రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, మల్లికార్జున్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, గోపాల్, విశ్వేశ్వర్, రవియాదవ్, హన్మంతు, నారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణాంజనేయ పౌరాణిక నాటకం



పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం

భూత్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని పదో వార్డులో శనివారం రాత్రి వరకవుల నరహరి రాజు సంగీత నాటక జనత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం చూపరులను ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడిగా ప్రముఖ పౌరణిక రంగస్థల నటుడు దుర్వాస రాజు సత్యభామగా రాధిక, రుక్మిణిగా ఇందిర జీవకళను ఉట్టిపడేలా నటించారు. ఆంజనేయుడిగా సంజీవయాదవ్, నారదుడిగా తిరుపతయ్య, బాలరాముడిగా హన్మంతు, గరుత్ముడిగా కోళ్ల శంకర్, ప్రతిహారిగా రాఘవేందర్, కుచేలుడిగా రాములు వారి వారి పాత్రలో విశేషంగా నటించారు. హార్మోనిష్టుగా నరహరి రాజు పాత్రదారులకు ఎంతో సహాయాన్ని అందించారు. బీఆర్ఎస్ నాయకుడు మురళీధర్‌గౌడ్ మాట్లాడుతూ అంతరించి పోతున్న పౌరణిక నాటక కళను జీవం పోస్తున్న జనత సేవా సమితి కళాకారులను అభినందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

హన్వాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిమోక్షం ప్రాథమిక పాఠశాలకు శనివారం సంపత్‌కుమార్ అధ్యక్షతన స్ఫూర్తి మిత్ర బృందం తరఫున విద్యార్థుల సౌకర్యార్థం రూ.లక్ష విలువ గల సామగ్రిని అందజేశారు. టీవీతో పాటు విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్లు, వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్స్, పలకలు, పెన్నులు, పెన్సిల్స్, స్కేళ్లు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి బృందం సభ్యులు నరసింహరావు, భీమ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, ప్రసాద్ కడియాల, దేవి, రాకేష్, ప్రశాంత్, తిలక్‌తో పాటు ఎంఈవో గోపాల్‌నాయక్, జీహెచ్‌ఎంలు జమద్, అబేద బేగం, యూటీఎఫ్ అధ్యక్షుడు కిష్టానాయక్, నోడల్ అధికారి వెంకట్రాములు, మాజీ సర్పంచులు రాములమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యం సాధించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి వెంకటరామారావు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాల్లో కూడా పట్టు సాధించాలని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి వెంకటరామారావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం జయప్రకాష్ ఇంజనీరింగ్ కళశాలలో ఎంబీఏ విద్యార్థులకు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం విద్య ఒక్కటే సరిపోదని, దీనికి తోడుగా నైపుణ్యాల్లో కూడా రాణించాలన్నారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల పరీక్షల నిర్వహణ అధికారి కోటల సందీప్‌కుమార్, ఎంబీఏ విగాధిపతి డాక్టర్ మధుమోహన్, ఎంబీఏ అధ్యాపకులు అనురాధ, చంద్రశేఖర్, కావ్య, అమీనా, చందన, సరిత పాల్గొన్నారు.